క్లుప్తంగా

వచ్చేనెల 3 నుంచి శాకంబరి ఉత్సవాలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో పార్వతీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు గురువారం వివరాలు తెలుపుతూ వచ్చే నెల 3వ తేదీన ఆషాఢ మాసం మూలా నక్షత్రం సందర్భంగా శ్రీపార్వతీ అమ్మవారికి శాకంబరీ అలంకరణ చేస్తామన్నారు. అదే విధంగా 4వ తేదీన ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం భక్తులను అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు

నున్న(విజయవాడరూరల్): ఈ ఏడాది ఖరీఫ్, రబీ పంటలను సాగు చేసే ప్రతి కౌలు రైతు కౌలు గుర్తింపు కార్డులు తీసుకున్నట్టయితే ప్రభుత్వ పథకాలను పొందే వీలుంటుందని వ్యవసాయ సహాయకురాలు హిమబిందు తెలియజేశారు. గురువారం నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కౌలు రైతులు–కౌలు గుర్తింపు కార్డులు అనే అంశం పై అవగాహన కార్యక్రమం జరిగింది. వీఆర్వో శ్రీనివాసరావు మాట్లాడుతూ కౌలు కార్డు వుంటే రైతు భరోసా, పంట బీమా, పంట నష్టం తదితర ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. సమావేశంలో పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



నున్న(విజయవాడరూరల్): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని నవజీవన్ సంస్థ కోఆర్డినేటర్ బి.సుజాత సూచించారు. అంతర్జాతీయ మత్తుపదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ర్యాలీ జరిగింది. డ్రగ్స్ ఈజ్ ఎ డెత్ ట్రాప్ అనే స్టిక్కర్లు పట్టుకొని ప్రచారం చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉయ్యూరుకు చెందిన మర్లపాటి ప్రదీప్‌కుమార్ కామయ్యతోపులో ప్రైవేటు ఉద్యోగం చేస్తాడు. అతను ఉయ్యూరు నుంచి బైక్‌పై ఉద్యోగానికి బయలుదేరి గోసాల వద్దకు రాగా గుర్తు తెలియని కారు అతనిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతనికి రక్తపు గాయాలయ్యాయి. అతనిని పోరంకిలో ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య చికిత్సకై చేర్చారు. గాయపడిన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కోడలిపై మామ దాడి

పెనమలూరు: కోడలిపై మామ దాడి చేయటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిశోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి కరణంగారి బజార్‌లో షేక్ మస్తాని ఉంటోంది. గతంలో ఆమె పెనమలూరుకు చెందిన వ్యక్తిని వివాహం చేసుకోగా అతను మృతి చెందాడు. ఆమె మరో వ్యక్తితో పోరంకిలో ఉంటుంది. కాగా మస్తాని బుధవారం పెనమలూరులో జెండా జెట్టు వద్దకు వెళ్లి తిరిగి పోరంకికి వస్తుండగా ఆమె మామ షేక్ కాలేషావలి గొడవకు దిగాడు. మరో వ్యక్తితో కలిసి ఉంటావా అని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కర్రతో మస్తాని పై దాడి చేశాడు. ఈ ఘటనలో మస్తాని తలకు గాయం అవ్వటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పోరంకిలో చోరీ

పెనమలూరు: పోరంకిలో ఏసీ సామగ్రి చోరీ జరగటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి ప్రభూనగర్‌లో దూడలనాగరాజు నివసిస్తున్నాడు. అతను ఏసీ మెకానిక్‌గా పని చేస్తున్నాడు .అయితే అతని ఇంటి బయట ఉంచిన ఏసీ పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం చోరీ చేశారు. పోయిన పరికరాల విలువ దాదాపు రూ. 30 వేలు ఉంటుంది. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ వైర్లు కూడా..

పెనమలూరు: పోరంకిలో విద్యుత్ వైర్లు చోరీ జరగటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి వాటర్ ప్లాంట్ వద్ద వైష్ణవి కన్‌స్ట్రక్షన్ నిర్మాణం చేస్తున్న భవనంలో విద్యుత్ వైర్లు ఉంచారు. గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ వైర్లు చోరీ చేశారు. దాదాపు రూ 60 వేలు విలువ చేసే విద్యుత్ వైర్లు చోరీ జరిగాయని సూపర్‌వైజర్ కె.మురళీమోహన్‌కృష్ణ తెలిపారు.

రైతులకు వెన్ను దన్ను ఆర్‌బీకేలు

- గ్రామంలోనే అందుబాటులో రైతాంగ సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

గన్నవరంరూరల్: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతి పంచాయతీలో రైతు భరోసా కేంద్రాలను నెలకొల్పింది. వీటి ద్వారా రైతులు గ్రామంలోనే సకల సేవలు పొందగలుగుతున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కోసం పట్టణానికి వెళ్లాల్సిన వ్యయ ప్రయాసలు తప్పాయి. ఆర్బీకేలో ఆర్డర్ ఇస్తే చాలు గ్రామంలోనే అందుబాటులోకి వస్తున్నాయి. వ్యవసాయ యంత్ర పరికరాలు సైతం ఆర్బీకేల ద్వారా రైతు గ్రూపులకు అందజేస్తున్నారు. రైతులకు వ్యవసాయ సాగులో ఎటువంటి సందేహాలున్నా వీఏఏలు అందుబాటులో ఉంటూ వారికి సాగుకు సంబంధించి సలహాలు, సూచనలు ఇస్తున్నారు. కౌలు రైతు కార్డులు ఉన్న రైతులకు కేడీసీసీ బ్యాంకు, ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులను కోరగా పలు బ్యాంకులు మండలంలో రైతాంగానికి రుణాలను ఇస్తున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో రైతు కుటుంబాలు ఎంతో సంతోషంగా ఉన్నాయి. వ్యవసాయాన్ని జీవనాధారంగా చేసుకుని బతికే కుటుంబాలకు ఆర్‌బీకే ఎంతో అండగా నిలుస్తోంది. సేవలన్నీ ఒకే చోట లభిస్తుండటంతో రైతు ఆనందానికి అవధులు లేవు. అధికారులే ఆర్‌బీకేలకు తరచూ వచ్చి సీజన్‌ల వారీగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. విత్తు నుంచి విపత్తు దాకా ప్రభుత్వమే రైతు సంక్షేమాన్ని కాపు కాస్తోందని పలువురు చెబుతున్నారు. ముఖ్యమంత్రి గ్రామగ్రామానా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటుచేసి రైతు పక్షపాతి అనిపించుకున్నారు. వ్యవసాయాన్ని పండుగలా చేశారని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సూరంపల్లి రైతు భరోసా కేంద్రం

మండలంలో గ్రామాలు :	21
ఆర్బీకేలు :	24
వీఏఏలు :	17
ఉద్యాన సహాయకులు :	3
ఎంపీఈఓలు :	2
రైతు భరోసా లబ్ధిదారులు :	9171

గిట్టుబాటు ధర ప్రభుత్వ పుణ్యమే



ఆర్‌బీకేలో సబ్సిడీపై వరి విత్తనాలు ఇస్తున్నారు. ఎరువులు ఉంటున్నాయి. సబ్సిడీపై ట్రాక్టర్‌లు ఇచ్చారు. ధాన్యం అధిక ధరకు అమ్ముకున్నాం. ఆర్బీకే వ్యవస్థను ఏర్పాటు చేసిన ప్రభుత్వ సేవలను రైతాంగం ఎప్పటికీ మరువదు.

–షేక్ గోరే, రైతు, ముస్తాబాద

విత్తు నుంచి అమ్మకం వరకూ అంతా గ్రామంలోనే



ఆర్‌బీకేల ఏర్పాటు, వీఏఏల వ్యవస్థ రూపకల్పనతో ప్రభుత్వం రైతాంగానికి ఎంతో మేలు చేసింది. విత్తనాల నుంచి ఈ–క్రాప్, వ్యవసాయ యంత్రాలు, అమ్మకాల వరకూ గ్రామ స్థాయిలోనే ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఇది. ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు.

– పాలడుగు రత్నారావు, రైతు, ముస్తాబాద

రైతు కుటుంబాలు ఆర్థికంగా బలపడ్డాయి



ఆర్బీకేల ఏర్పాటు ద్వారా సేవలన్నీ గ్రామంలోనే రైతుకు అందుబాటులోకి తేవడం గొప్ప విషయం. గతంలో విత్తనాల కోసం మండల కేంద్రాలకు వెళ్లి ఇబ్బందులు పడే వాళ్లం. ఇప్పుడన్నీ ఆర్డర్ పెడితే ఇక్కడే దొరుకుతున్నాయి. ఈ–క్రాప్ కోసం బాధలు పడే వాళ్లం. కానీ నేడు ఈ–క్రాప్ జరగకపోతే వీఏఏలు వెంటపడి మరీ చేయిస్తున్నారు. ధాన్యం అమ్ముకోవడానికి దళారీలకు ఇవ్వాల్సి వచ్చేది. ఈరోజు మద్దతు ధరకు అమ్మడంతో కుటుంబాలు ఆర్థికంగా లబ్ధి పొందుతున్నాయి.

–కాసరనేని పాపారావు, రైతు, సూరంపల్లి

యంత్ర వ్యవసాయానికి ప్రోత్సాహం



యంత్ర పరికరాలు, వరి కోత యంత్రాలు ఇచ్చారు. ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించారు. ఒకప్పుడు ఈ క్రాప్ చేయాలంటే వాళ్ల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఈరోజు ఎంతో సులభంగా మారింది. ఈ ఘనత ఆర్‌బీకేలదే.

–వల్లూరు శ్రీనివాసరావు, తెంపల్లి, రైతు

'మానవత' సేవలు ఎంతో స్ఫూర్తిదాయకం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఆపత్కాలంలో ఆపన్నులకు మానవత సభ్యులు అండగా నిలుస్తూ, నిస్వార్థ సేవలు అందించటం ఎంతో స్ఫూర్తిదాయకమని దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్ అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ హనుమాన్‌జంక్షన్ శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. స్థానిక ఏలూరురోడ్డులోని గణపతి కాంప్లెక్స్‌లో మానవత కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కనకదుర్గాప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో నానాటికీ మానవత్వం, దాతృత్వం కనుమరుగవుతున్న తరుణంలో మానవత సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పేద, ధనిక భేదం లేకుండా ఎవరూ మృతి చెందినా ఉచితంగా మార్చురీ ఫ్రీజర్ బాక్సులు, అంతిమయాత్ర నిర్వహించేందుకు ఉచితంగా శాంతిరథాన్ని అందిస్తున్న మానవత సేవలు అభినందనీయమని కొనియాడారు. మానవత జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా కూరెళ్ల సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కళ్లేపల్లి నారాయణరావు, కోశాధికారిగా పాబోలు గణేష్‌బాబు, ఉపాధ్యక్షులుగా దయాల ప్రభాకరరావు, సహాయ కార్యదర్శిగా గంటా ఇందిరాదేవి, కార్యవర్గ సభ్యులుగా గూడపాటి జయరామచంద్రరావు, రేవిణిశెట్టి సూర్యనారాయణ, గోళ్ల మల్లికార్జునరావు, కన్నికంటి వెంకట సుబ్బారావు ప్రమాణ స్వీకారం చేశారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న మానవత నూతన కార్యవర్గ సభ్యులు

మానవతకు దాతల విరాళం

మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు విశ్రాంత పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ బాణాల నరసింహారావు రూ.50 వేలు విరాళాన్ని అందించారు. కాజ ప్రభాకరరావు, రంగనాయకమ్మల జ్ఞాపకార్థం వారి మనవడు పాలడుగు రామకృష్ణ మానవతకు మార్చురీ ఫ్రీజర్ బాక్సును అందించారు. అప్పనవీడు సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, మానవత సీనియర్ సభ్యులు తోట వెంకటేశ్వరరావు, గంటా సత్యనారాయణ, పొట్లూరి శేషాచలం, వడ్డి రాజేశ్వరరావు, కొట్నాని రామచంద్రరావు, సుబ్బారావు, వేగిరెడ్డి సూర్యనాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలి

ఎంఈఓ–2 కె.ఎస్.ఎన్.ప్రసాద్

కంకిపాడు: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని ఎంఈఓ–2 కె.ఎస్.ఎన్.ప్రసాద్ అన్నారు. ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో మండల స్థాయి హెచ్‌ఎంలు, ఎంపీపీ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ నూతన విద్యా విధానాల అమలు ద్వారా విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను విద్యార్థులు, తల్లిదండ్రుల చెంతకు చేరేలా ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను సాధించటంలో ముఖ్యపాత్ర పోషించాలని సూచించారు. నాడు–నేడు ద్వారా పాఠశాల్లో మౌలిక వసతుల కల్పన సమర్థంగా సాగుతుందన్నారు. వసతులను సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు, విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేస్తున్న ఎంఈఓ–2 కె.ఎస్.ఎన్.ప్రసాద్

జగనన్న సురక్ష విజయవంతం చేయాలి

రామవరప్పాడు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న జగనన్న సురక్ష పథకం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అన్నారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో గురువారం వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమారి మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలనలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లి వారి అవసరాలను గుర్తించి పరిష్కరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. సచివాలయాల కన్వీనర్ల మండల అధ్యక్షుడు సాదం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి వారి అవసరాలను గుర్తించాలన్నారు. జనన ధ్రువీకరణ, ఆదాయ, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లతో పాటు పలు రకాల సర్టిఫికెట్లు, ఆధార్‌కు మొబైల్ నంబర్ లింకింగ్, కొత్త రేషన్ కార్డులు, రేషన్ కార్డుల విభజన, ఆధార్ సేవలు వంటి వాటికి సంబంధించి అనుసరించాల్సిన విధి, విధానాలను దరఖాస్తు దారుల నుంచి తీసుకోవాల్సిన పత్రాల గురించి అవగాహన పరిచారు. వచ్చే నెల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో మండలాధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉంటారని పథకాలు అందని అర్హులను గుర్తించి వారికి సత్వర న్యాయం జరిగేలా చూస్తారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సువర్ణరాజు, ఎంపీటీసీ సభ్యులు దూరు రత్నం, పైల లక్ష్మి, వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

జూలై 1, 2 తేదీల్లో సీపీఎం మహా పాదయాత్ర

గన్నవరం: పోలవరం నిర్వాసితుల సమస్యలపై సీపీఎం చేపట్టిన నెల్లిపాక–విజయవాడ మహా పాదయాత్ర జూలై 1, 2 తేదీల్లో నియోజకవర్గంలో జరగనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో సీపీఎం, ప్రజా సంఘాలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా పాదయాత్రలో భాగంగా హనుమాన్‌జంక్షన్, గన్నవరంలలో సభలో నిర్వహించనున్నట్లు చెప్పారు. పార్టీ శ్రేణులు, రైతు, ప్రజా సంఘాల నేతలు పాల్గొనాలని కోరారు. పార్టీ నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, కళ్ళం వెంకటేశ్వరరావు, అనుమోలు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కౌలు కార్డులపై అవగాహన సదస్సు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు రైతు భరోసా కేంద్రంలో గురువారం కౌలు కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ సహాయకులు రైతులకు కౌలు కార్డులపై ఉన్న అనుమానాలు, అపోహలను నివృత్తి చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రంగనాథ్ బాబు, సర్పంచ్ శీలం రంగారావు, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్, గ్రామ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ విష్ణువర్ధన్‌రావు, ఏఈవో విజయ్‌కుమార్, వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా శైలజ

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల ప్రత్యేక అధికారిగా జిల్లా కోఆపరేటివ్ అధికారి కె.శైలజను ప్రభుత్వం నియమించినట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు తెలియజేశారు. మండలంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రత్యేకాధికారి పర్యవేక్షణ ఉంటుందని ఆయన తెలియజేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలించిన జెడ్పీటీసీ

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును గురువారం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి పరిశీలించారు. మండల విద్యాశాఖ అధికారి–2 ఆర్.కమలతో కలిసి ఆమె మధ్యాహ్న భోజనంలోని ఆహార పదార్థాల నాణ్యతను పర్యవేక్షించారు. అనంతరం విద్యార్థులతో కలిసి జెడ్పీటీసీ భోజనం చేశారు. పాఠశాలలోని విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం చేసే విధంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని చెప్పారు. భోజనశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. హెచ్‌ఎం ఎన్.రవీంద్రభవాని, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాధుల స్థలం చుట్టూ ప్రహరీకి శంకుస్థాపన

ఉంగుటూరు: మండలంలోని పెద అవుటపల్లి ఆర్‌సీఎం సంఘం సమాధుల చుట్టు ప్రహరీ నిర్మాణానికి ఆంధ్రా, తెలంగాణ, ఒడిశా మేరీమాత కపుచియాన్ ప్రావిన్షియల్ ఫాదర్ ప్రత్తిపాటి మరియదాసు గురువారం శంకుస్థాపన చేశారు. మత గురువులు, సంఘస్తుల సమన్వయంతో నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో బ్రదర్ జోసఫ్‌తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ జోసఫ్ పాలడుగు, ఆర్‌సీఎం సంఘస్తులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కరపత్రం విడుదల

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాదలో గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన కరపత్రం విడుదల చేశారు. జూలై 7వ తేదీన విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆధ్వర్యంలో జరిగే జనజాగృతి మహాసభకు గ్రామాల నుంచి తరలిరావాలని జిల్లా ఎమ్మార్పీఎస్ కో–కన్వీనర్ చోడవరపు వెంకటేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు.

నేడు 'జగనన్న సురక్ష' ప్రారంభం

ఉంగుటూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 23న జగనన్న సురక్ష ప్రారంభ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

బాపులపాడు ఎంఈవోలు బాధ్యతల స్వీకరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండల విద్యాశాఖాధికారులుగా బి.వి.శేషగిరిరావు, బి.సురేష్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా చేపట్టిన బదిలీల్లో భాగంగా ప్రస్తుతం ఇక్కడ ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్న సక్సేనా రాజు పశ్చిమగోదావరి జిల్లాకు వెళ్లారు. ఆయన స్థానంలో ఎంఈవో–1గా బంటుమిల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న బి.వి.శేషగిరిరావు బదిలీపై వచ్చారు. కొత్తగా ఏర్పాటు చేసిన మండల విద్యాశాఖాధికారి–2 పోస్టుకు బి.సురేష్‌కుమార్ పదోన్నతిపై ఇక్కడకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్‌గా బి.సురేష్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నారు. నూతన ఎంఈవోలను పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.

ట్రాక్టర్ల కొనుగోలుకు ఎమ్మెల్యే వంశీ ఆర్థిక తోడ్పాటు

గన్నవరం: నియోజకవర్గంలోని రైతులు వ్యవసాయ అవసరాలకు ట్రాక్టర్ల కొనుగోలు నిమిత్తం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ ఒక్కొక్క వాహనానికి రూ.లక్ష ఆర్థిక సాయం చేయనున్నట్లు శాసనసభ్యుని ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ఎమ్మెల్యే వంశీమోహన్ రైతుల శ్రేయస్సుకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ప్రతియేటా పోలవరం కాలువపై ఉచిత మోటార్లను ఏర్పాటు చేసి రైతులకు సాగునీటి అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయం పూర్తిగా యాంత్రీకరణపై ఆధారపడిన పేద, మధ్య తరగతి రైతులు ట్రాక్టర్ల కొనుగోలుకు తనవంతు సాయం చేసేందుకు ఎమ్మెల్యే ముందుకు వచ్చారన్నారు. ఐషర్ కంపెనీకి చెందిన 380, 480, 551 సెంటర్ గేర్ మోడల్స్‌కు చెందిన ట్రాక్టర్లు కొనుగోలు చేసే రైతులకు ఎమ్మెల్యే తన స్వంత నిధుల నుంచి రూ.లక్ష అందజేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. సదరు ట్రాక్టర్లు కొనుగోలు చేసే రైతులు ఆర్థిక సాయం కోసం స్థానిక శాసనసభ్యుని కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.



ఫాదర్ మరియదాస్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీ

వంశీమోహన్‌ను కలిసిన ఫాదర్ ప్రత్తిపాటి

ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల మేరీమాత కపుచియన్ ప్రావిన్స్ ప్రావిన్షలేట్ ఫాదర్ ప్రత్తిపాటి మరియదాస్ గురువారం స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో ఎమ్మెల్యే వంశీమోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మరియదాస్‌ను ఎమ్మెల్యే దుశ్శాలువాతో సత్కరించారు. బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ పాలడుగు జోసెఫ్, ఫాదర్ ప్రేమ్, వైఎస్సార్‌సీపీ నాయకులు గుడిసె బాలస్వామి, గుదే ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

కంకిపాడు: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మండవ శ్రీనివాస్ కోరారు. నూతనంగా ఎంఈఓ–2గా బాధ్యతలు స్వీకరించిన కేఎస్ఎన్ ప్రసాద్‌ను ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో గురువారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యాభివృద్ధితో పాటుగా ఉపాధ్యాయుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈఓ–2 ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పచ్చిగళ్ల సురేష్‌బాబు, అద్దేపల్లి విజయ్‌కుమార్, ఏ.శ్రీనివాసమూర్తి, లావణ్య పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓ–2ను సత్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పెనమలూరు: గోసాల గ్రామంలో రోడ్డు నిర్మాణం చేయటానికి గురువారం గ్రామ సర్పంచి సంగెపు శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచి సంగెపు శ్రీనివాసరావు వివరాలు తెలుపుతూ గోసాల సాయిబాబా గుడి వద్ద నుంచి రాజుగారి డొంక రోడ్డు వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం చేయాలని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథిని కోరారన్నారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే పార్థసారథి మండల పరిషత్ నిధులు రూ. 40 లక్షలు మంజూరు చేయగా, గ్రామ పంచాయతీ మరో రూ. 14 లక్షలు నిధులు జోడించిందన్నారు. మొత్తం రూ. 54 లక్షలతో కాలువ కట్టపై సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టామని వివరించారు. కార్యక్రమంలో సర్పంచితో పాటు గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు పీర్ అహ్మద్, ఎండీ దాదా, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, నేతలు వలి, బాషా, శివాజి, మౌలాలి పలువురు పాల్గొన్నారు.



గోసాలలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచి సంగెపు శ్రీనివాసరావు

సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన సదస్సు

ఉంగుటూరు: అర్హత ఉన్న ప్రతి కౌలు రైతు సీసీఆర్‌సీ కార్డులు తీసుకోవాలని ఏవో హరీష్‌కుమార్ సూచించారు. మండలంలోని ఆత్కూరు, పొట్టిపాడు, ఉంగుటూరు, వెల్దిపాడు గ్రామాల్లో పంటసాగు హక్కు పత్రాలపై(సీసీఆర్‌సీ) అవగాహన సదస్సులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ యజమాని సాగుదారునికి పంట సాగుపత్రం ఇప్పించడం వలన ఎటువంటి నష్టం జరగదన్నారు. సీసీఆర్‌సీ కార్డులు తీసుకోవడం వలన ఉచిత పంట బీమా, పంట నష్ట పరిహారం, బ్యాంకు రుణాలు, పండించిన ధాన్యం అమ్ముకోవచ్చన్నారు. అనంతరం సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శంకర్, ఏఈవో దుర్గానాగేశ్వరరావు, వీఆర్‌వోలు, వీఏఏలు పాల్గొన్నారు.



పొట్టిపాడులో సీసీఆర్‌సీ కార్డులు అందజేస్తున్న ఏవో హరీష్

ముస్తాబాదలో బోరు నిర్మాణ పనులు ప్రారంభం

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాద గ్రామంలో గురువారం కొత్తగా నిర్మించే మంచినీటి బోరు నిర్మాణ పనులను సర్పంచ్ వి.రాధాకృష్ణ ప్రారంభించారు. గ్రామస్తులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా పెద్ద చెరువు కట్ట వెంట ఈ బోర్‌వెల్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీంతో గ్రామానికి భవిష్యత్‌లో కూడా తాగునీటి ఇబ్బందులు ఉండవన్నారు. ఎంపీటీసీలు షేక్ మున్నీ, జి.భాగ్యరాజ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందాలి



కంకిపాడు: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లోని ధ్యాన యోగ సాయి మందిరాన్ని గురువారం సందర్శించారు. సాయి నాథుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు తహసీల్దార్ ప్రసాద్‌ను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ద్వారా అన్ని సేవలు క్షేత్రస్థాయికి తీసుకెళ్లామన్నారు. సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ఆర్‌ఐ వెంకటరమణ, అసోసియేషన్ ప్రతినిధులు వై.శ్రీనివాస్, కె.నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.